# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 39 సంచిక 8

పేజీలు 44

ఏప్రియల్ 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


ఈ సంచికలో ............................ ....... పేజీ


| | |
|---|---|
| శ్రీకృష్ణ కర్ణామృతము | 4 |
| శ్రీబాబూజీ ఉవాచ | 5 |
| అమ్మమాట | 8 |
| రామాయణంలో స్త్రీ పాత్రలు | 10 |
| చంద్ర కాళీప్రసాద అమ్మ | 12 |
| గురువు అవసరం | 13 |
| తెలివైన చిలుక | 15 |
| శ్రీ సద్గురు వాణి | 17 |
| వాదిరాజ స్వామి | 19 |
| అసలు నిజం | 21 |
| సాధనే ముక్తికి మార్గం | 25 |
| వాహనము - వేదన | 27 |
| గుర్వష్టకమ్ | 29 |
| భజ గోవిన్దమ్ | 31 |
| శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు | 33 |
| శత్రులు మిత్రులౌట | 34 |
| కైవల్యోపనిషత్ | 36 |
| సమర్థసద్గురునాథుని దివ్యచరిత్ర | 38 |
| యుధిష్ఠిరుడు - యక్షుడు | 40 |
| విష్ణు కథలు | 41 |

# శ్రీ కృష్ణ కర్ణామృతము

కీ.శే - సుశీలా ప్రసాద

**ద్వితీయాశ్వాసము - 83 వ శ్లో॥**

**గోపాలాజిర కర్దమే విహరసే విప్రాధ్వరే లజ్జసే।**
**బ్రూషే గోకుల హుఙ్కృతైః స్తుతిశతైర్మౌనం విధత్సే విదామ్।**
**దాస్యం గోకుల పుంశ్చలీషు కురుషే స్వామ్యం న దాన్తాత్మసు।**
**జ్ఞాతం కృష్ణ తవాఙ్ఘ్రి పఙ్కజ యుగం ప్రేమ్ణాచలం మఞ్జులమ్॥**

తాత్పర్యము -



కృష్ణా! గొల్ల యిళ్ళ ముంగిళ్ళ బురదల యందు ఆడెదవు, బ్రాహ్మణుల యజ్ఞములలో బోవ సిగ్గుపడుదువు. ఆవుల రంకెలతో మారు పలికెదవు, పండితుల యొక్క స్తోత్రశతములచేత మౌనమును పూనెదవు. గోపికలకి దాస్యము చేయుదువు, శాంతచిత్తుల యెడ ప్రాభవమును చేయవు. ఓ కృష్ణా! నీ పోబడి తెలిసినదిలే. నీ అందమైన అడుగుదామరల జంట అనురాగముచే లోలమైనది. నీకెక్కడ ప్రేమయున్నదో అక్కడికేగెదవుగాని హెచ్చుతగ్గులు నీకు లేవు. నీకు సర్వ సమర్పణ చేసుకున్న హృదయమే నీ నిలయము కృష్ణా!

---

*భగవద్గీతలోని నిచ్చెనకు, భజగోవిందంలోని నిచ్చెనకు తేడా ఏమిటి?
*కబీర్‌దాస్ ఏమని వాపోయాడు?
*భగవంతుడు ఎవరికి పేదరికాన్ని అనుగ్రహిస్తాడు?
*చిలుక నేర్పిన సత్సంగ విధానం ఏమిటి?
*అనంతశక్తి అంటే ఎలా ఉంటుంది?
*శివాజీ మహరాజ్ రాజ్యాన్ని ఎలా పరిపాలించాడు?
*కుక్కకి, ఆవుకి వుండి మనిషికి లేనిది ఏమిటి?
*అరిషడ్వర్గం శమాది షట్క సంపత్తిగా ఎలా మారుతుంది?
*అమ్మ అంటే అర్థం ఏమిటి?

***సమాధానాలు లోపలి పేజీలలో.........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

16-3-1980.

శ్రీ బాబూజీ ఉదయం వ్యాహ్యాళికి వచ్చారు. కొంతసేపు నామ సంకీర్తన చేసిన తర్వాత భక్తులకు బోధచేశారు.

"ఆత్మ దర్శనం కావాలంటే, దానిపైన ఆవరించిన అహంకారమనే అజ్ఞానం తొలగాలి. ఒక జ్యోతి వుందను కోండి. దానిని ఆవరించి ఒక మూకుడు ఉన్నట్లయితే ఆ జ్యోతి దర్శనం అవుతుందా? ఆ మూకుడును తొలగిస్తేనే జ్యోతి దర్శనం అవుతుంది. అదే ఆత్మ దర్శనం, అదే జ్ఞానం."



గీతలో చెప్పినట్లు ఫలాపేక్ష లేకుండా పరమాత్మకు సర్వసమర్పణ చేసి కర్మలను చేయుట వలన ముక్తి లభిస్తుంది. కర్మ చేయకుండా ఉండటం అసంభవం. కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు కర్మలను చేస్తూనే వుంటాయి. అంతరింద్రియాలు నిర్వహించే కర్మలను అరికట్టటం కష్టం. సమస్త ఇంద్రియాలు నిర్వహించే కర్మలను అరికట్టటం కన్న, వీటన్నిటికి మెయిన్ స్విచ్ అయిన మనస్సును నిశ్చలం చేసినట్లయితే, దాని ప్రేరణచేత, పనిచేసే ఇంద్రియాలన్నీ నిర్వహించే విధులు, అదుపులో వుంటాయి. కాని మనస్సు నిశ్చలత్వాన్ని పొందాలంటే దానిని పరమాత్మ యందు లగ్నం చేయాలి.

మనస్సు నిశ్చలత్వాన్ని సాధించినపుడు ఆనందమే మిగులుతుంది. అన్నింటియందు తానే ప్రకాశిస్తాడు. అది సగుణ, నిర్గుణ తత్వాలకు మించినది. జ్ఞాని అట్టి స్థితిలో ఉంటాడు. అదే అభేద స్థితి.

ఆకాశము అన్నింటియందు వ్యాపించియుంటుంది. దాని స్వరూపము ఏమిటి? విద్యుత్తు శక్తివంతమైనది. ఆ శక్తికి రూపము ఉందా?

అలాగే పరమాత్మతత్వము తెలియనివారు, పరమాత్మ లేడంటారు. అది అజ్ఞానం. మనస్సు సూక్ష్మదర్శిని ద్వారా చూసినట్లు సూక్ష్మాతిసూక్ష్మమైన అనంత శక్తిని దర్శించాలి. పరమాత్ముడు నిరాకారుడు, నిర్వికారుడు, అనంతుడు. అట్టి అనంతశక్తిని ఎవరు తెలుసుకొనగల్గుతారు? అణోరణీయాన్, మహతోమహీయాన్ అన్నట్లు ఉంటుందా శక్తి. ఆ అనంతశక్తి దర్శించిన వాడికి ఇంక ఉదయించే ప్రశ్న ఏమిటి?

తర్వాత కొలదిసేపు రత్నంగారు వ్రాసిన శ్రీ బాబు ఉపన్యాసం చదివారు. మధ్యలో శ్రీ బాబు కల్పించుకొని "శ్రీరామచంద్రుడు 11వేల సం။లు పరిపాలనచేసిన తర్వాత ఒకనాడు యమధర్మరాజు బ్రాహ్మణ వేషధారియై వచ్చి 'ప్రభూ! తమతో ఏకాంతంగా మాట్లాడాలి' అంటాడు.

దానికి శ్రీరామచంద్రుడు అంగీకరించి తమ ఏకాంత ప్రసంగానికి అంతరాయం కల్గించకుండా లక్ష్మణుని ద్వారం వద్ద కావలి ఉండమంటాడు. 'లక్ష్మణా! నా అనుజ్ఞ లేకుండా లోపలికి ఎవరినీ ప్రవేశపెట్టరాదు' అని ఆజ్ఞాపిస్తాడు.

యమధర్మరాజు తన నిజరూపాన్ని శ్రీరామచంద్ర ప్రభువుకి తెలియజేసి 'ప్రభూ! తమరు వైకుంఠాన్ని వదలి చాలాకాలం అయింది. తమ రాకకోసం వైకుంఠం ఎదురుచూస్తోంది. శ్రీలక్ష్మీదేవి ముందే వైకుంఠము చేరి తమ రాకకోసం ఎదురుచూస్తోంది. సృష్టికర్త ఈ విషయాన్ని తమకు తెలియజేయమన్నారు' అంటాడు.

ఇంతలో దుర్వాసుడు శ్రీరామచంద్రుడిని కలుసుకోవటానికి వస్తాడు. లక్ష్మణుడు ఆలోచనలో పడ్డాడు. దుర్వాసునికి ఎదురు నిలిస్తే శపిస్తాడు. వంశనాశనం తప్పదు. అలా కాకుండా అన్నగారి ఆజ్ఞమీరితే, తనకు శిరచ్ఛేదం. అన్నగారి చేతులలో శిరచ్ఛేదానికే నిశ్చయించుకొని,

అన్నగారికి దుర్వాసుని రాకను తెలియజేస్తాడు.

దుర్వాసుడు శ్రీరామచంద్రుని కలుసుకొని ఆకలిగా ఉంది. ఏది ఉంటే అది పెట్టమని అడిగి తిని వెళ్ళిపోతాడు. అది కేవలం ఒక ఘటన మాత్రమే. శ్రీ లక్ష్మణుడు ఆదిశేషుడు, శ్రీరామచంద్రుడి అవతారం చాలించే సమయం ఆసన్నమైంది. కాబట్టి లక్ష్మణుడు ముందుగా వైకుంఠం చేరటానికి ఇది కేవలం ఒక ఎత్తుగడ. అన్నగారి ఆజ్ఞ మీరినందుకు శ్రీ లక్ష్మణుడు సరయూ నదిలో శరీరాన్ని చాలిస్తాడు. చాలించేముందు జ్ఞానోదయమై అసలు రహస్యాన్ని తెలుసుకొంటాడు. శ్రీరామచంద్రునికి, సీతా మహాతల్లికి శాశ్వతంగా సేవచేసే భాగ్యం కలుగుతున్నందుకు సంతోషిస్తాడు.

దాని తర్వాత శ్రీరామచంద్రుడు కోసల రాజ్యాన్ని రెండు ఖండములు చేసి, లవకుశులకు పట్టాభిషేకం చేసి తన అవతారాన్ని పరిసమాప్తి చేస్తాడు" అన్నారు శ్రీ బాబు.

**పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు**

**మే 2020**

7 గురు - శ్రీ గురు (వైశాఖ) పూర్ణిమ

17 ఆది - శ్రీగురు దశమి

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ఠ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

15 సోమ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - అమావాస్య - సూర్యగ్రహణం ఉ॥ 10-25ని॥ నుండి మ॥ 1-54ని॥ వరకు (మృగశిర నక్షత్రం, మిధునరాశి)

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## సత్సంగ మహిమ

'సత్సంగం' అంటే నిరంతరం సద్వస్తువుతో కలసి వుండటమని అర్థం. అంటే మనస్సుని ఎల్లప్పుడూ, ఏ పని చేస్తున్నా కూడా సద్వస్తు విచారణలో వుంచడం సత్సంగం. సత్సంగం యొక్క మహిమను గురించి తెలుసుకోవాలని, నిరంతరం నారాయణ స్మరణ చేసుకునే నారదమునికి కూడా కోరిక కలిగి, ఆయన తన తాతగారైన సాక్షాత్ నారాయణమూర్తినే 'సత్సంగం మహిమ ఏమిటి?' అని అడిగాడు.



అంతట ఆ జగన్నాటక సూత్రధారి నారాయణుడు నారదుని సందేహాన్ని అనుభవపూర్వకంగా తీర్చదలచి, 'నాయనా! నారదా! ఇప్పుడిప్పుడే భూలోకంలో ఫలానా చోట ఒక కీటకం జన్మించింది. నీ ప్రశ్నను తీసుకెళ్ళి దానిని అడుగు. అది సమాధానం ఇస్తుంది' అని చెప్పగా, నారదుడు అలాగే వెళ్ళి ఆ పురుగుని ప్రశ్నించగానే, తీరా అది కాస్తా మరణించింది. నారదుడు తిరిగి నారాయణమూర్తి దగ్గరకు వెళ్ళి జరిగిన విషయం తెలపగానే, ఆయన నారదుని ఈ మాటు భూలోకంలో అప్పుడే జన్మించిన ఆవుదూడని అడగమని పంపించాడు. ఈసారి కూడా నారదుడు ఆ దూడని ప్రశ్నించగానే అది మరణించింది. నారదుడు హతాశుడై పరుగెత్తుకుని వెళ్ళి నారాయణమూర్తితో చెప్పాడు.

ఈమాటు నారాయణుడు నారదుడిని భూలోకంలో చోళరాజుకు అప్పుడే జన్మించిన బాలుని దగ్గరకు పంపించాడు. ఉయ్యాలలో పడుకోబెట్టిన ఆ రాజకుమారుడిని 'సత్సంగం యొక్క మహిమ' గురించి వివరించమని కోరాడు నారదుడు.

నారదుడిని చూసిన మరుక్షణమే ఆ పసిబాలుడు తన రెండు చేతులూ జోడించి నమస్కరించి 'మహాత్మా! నేను మొదటి జన్మలో కీటకమై జన్మించినప్పుడు మీరు వచ్చి నన్ను ఇదే ప్రశ్నవేయగా, నాకు మీ ప్రథమ దర్శనమై మరణించాను. మీ దర్శనమాత్రం చేత నాకు

గోజన్మ లభించింది. ఆ జన్మలో కూడా నా అదృష్టం కొద్దీ తమ దర్శన భాగ్యం లభించింది. వెంటనే ఆ తనువు చాలించి, ఈనాడు అత్యంత దుర్లభమైన ఈ మానవజన్మ, అందులోనూ దేనికీ కొరతలేని ఉత్తమ క్షత్రియ వంశంలో జన్మించడం జరిగింది. నాకు ఇహపరాలకు కూడా లోటులేని భోగభాగ్యాలు కలిగాయి. ఈనాడు మరల మీ దర్శన భాగ్యం ద్వారా నా సంచిత కర్మమంతా హరించిపోయింది. నిరంతర హరినామ స్మరణలో ఓలలాడే తమవంటి సాధువుల దర్శనం వల్ల నా జన్మజన్మార్జిత పాపములన్నీ నశించి, కీటకజన్మ నుండి గోజన్మ, గోజన్మ నుండి అత్యంత దుర్లభమైన మానవజన్మ కలిగే పుణ్యం లభించింది.

సాధూనాం దర్శనం పుణ్యం । స్పర్శనం పాపనాశనం ।
సంభాషణంకోటితీర్థ స్నాన ఫలం । వందనం మోక్షదాయకం॥

కనుక ఇవన్నీ సత్పురుషులైన తమ దర్శనం వల్ల నాకు లభించాయి. ఇహ ఇంతకంటే సత్సంగ మహిమకు నిదర్శనం ఏమి కావాలి!' అని ఆ శిశువు నారదునికి నమస్కరించాడు.

అదే విధంగా, కరకు బోయవాడైన రత్నాకరుడు, నారదముని అనుగ్రహానికి పాత్రుడై, వారు ఉపదేశించిన రామనామ జపం వలన పునీతుడై, రామదర్శనం పొంది, ఆదికవియై, రామాయణ మహాకావ్యాన్ని మనకు అందించాడు.

'మహాత్ములు వస్తున్నారు, వెళ్ళిపోతున్నారు, వారు అందించిన బోధను అందుకుని, ఆచరించి తరించండి. సాధువులైన ఓ అన్నలారా! జీవితాన్ని కేవలం త్రాగుతూ, తింటూ, నిద్రపోతూ కాలాన్ని వ్యర్థం చేసుకోకండి నాయనలారా! 84లక్షల జీవరాసుల జన్మలనెత్తగా లభించిన అత్యంత దుర్లభమైన మానవజన్మని కేవలం ఆహార పానీయ, నిద్రకే వెచ్చిస్తే కమలముఖుడైన ఆ రాముని కీర్తించని మోము గో పృష్ఠంతో సమానం సుమా!' అని కబీర్‌దాసు వాపోయాడు.

కనుక మనం అందరం కూడా, నిరంతరం సత్సంగమనే మధుర రసంతో మన మనస్సులు నింపుకున్న నాడు, భక్త హృదయ కమలంలో ఆ కమలముఖుడైన ఆ రాముడనే తుమ్మెద వచ్చి, జ్ఞాన మకరందాన్ని గ్రోలుతూ మైమరచిపోతాడు. ఒకవేళ ఆ భక్తహృదయ కమలం సూర్యాస్తమయమై, ముకుళించుకుపోయినా, ఆ రామచంద్రుడనే తుమ్మెద అందులోనే బందీ అయిపోతాడు".

# రామాయణంలో స్త్రీ పాత్రలు - సుషుమ్నా ప్రసాద

## తార

శ్రీమద్రామాయణంలో కిష్కింధకాండ యందు తార పరిచయ మవుతుంది. తార మహా పరాక్రమశాలి, వీరుడు, గొప్ప ధీరుడు అయిన వానర సార్వభౌమునకు పట్టమహిషి. తార పేరుకు తగ్గట్టు ఎంతో మేధావి. పూర్వాపరాలను చక్కగా యోచించగల సాధ్వీలలామ. పాత్ర పరిమితమైనదైనా ఎంతో ధీశాలి, యుక్తాయుక్త వివేకము కలది. క్రోధావేశములతో శ్రీరామచంద్రుడు అండగా వున్న తన సోదరుడు సుగ్రీవుడు చేసిన సింహ గర్జనకు కయ్యానికి కాలు దువ్వాడు వాలి. ప్రమదాన్ని కొనితెచ్చి పెట్టుకొంటున్న భర్త వాలిని చూసి, తార ఇలా సంబోధించింది.

**సాధు క్రోధమిదం తీర, నదీవేగమివాగతమ్।**

**శయనాదుత్థితః కాల్యంత్యజ భుక్తామివ స్రజమ్॥**

'సాధు' అంటే మంచివాడు, సరళ స్వభావుడని అర్థము. 'సాధు' అని భర్తను చాలా చక్కగా సంబోధించింది. 'ఓ వీరుడా! ఉదయం నిద్ర లేచినవాడు, నలిగిపోయిన పూలమాలను ఎలా విసిరి వేస్తాడో, అంతే వేగంగా నీకు వచ్చిన కోపాన్ని విడిచిపెట్టు' అని భర్తను సంబోంధించింది. 'తన కోపమె తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష' అని హితవు చెప్పింది.

వాలికి బాహు బలం వుంది. తారకు బుద్ధి బలం వుంది. వాలికి కండ పుష్టి వున్నది. తారకు కుశాగ్ర బుద్ధి, సమయోచితమైన ఆలోచన వున్నాయి. క్రోధం బుద్ధిని పాడుచేసి, విజ్ఞానాన్ని వక్రింపజేసి, శతృత్వాన్ని పెంచుతుంది. అలాంటి దుఃఖకారణమైన క్రోధాన్ని విడిచి పెట్టమని తన భర్తను 'సాధు' అని సంబోధించి, తన వాక్చాతుర్యమును, సరళ స్వభావమును ప్రదర్శించింది. తారకు చాలా దూరదృష్టి సమయోచితమైన ఆలోచన ఎదుటి వారి శక్తిని బేరీజు వేయగల సమర్థత వున్నది. అంతకుముందే చావుదెబ్బలు తిన్న సుగ్రీవుడు మరల వచ్చి గంభీరంగా గర్జించి, కయ్యానికి కాలుదువ్వుతున్నాడంటే, అది సుగ్రీవుడు మూర్ఖంగా చేసే పనికాదని తార గ్రహించింది. ఎందుకంటే సుగ్రీవుడు మంచి బుద్ధిమంతుడు, మంచి నేర్పరి. ఎదుటి వారి శక్తిని అంచనా వేయకుండా స్నేహం

చేయడని తారకు తెలుసు. ఈ గర్జన వెనుక బృహత్తర పథకం వున్నదని, ఎవరో మహత్తరమైన వ్యక్తి సహాయం వుండవచ్చని గ్రహించింది తార. అందుకే వాలిని యుద్ధ విముఖుణ్ణి చేయడానికి తన కుశాగ్ర బుద్ధిని, చాకచక్యము, ప్రేమతో రంగరించి ప్రయత్నించింది. కాని, ఆమె ప్రయత్నమంతా బూడిదలో పోసిన పన్నీరే అయింది.

క్రోధంతో కుతకుతలాడుచున్న వాలిని శాంతపరచడానికి తార వాలిని లాలనగా కౌగలించుకుని, 'హే సాధూ!, హే వీరా!' అని సౌహార్ద్ర హృదయంతో సంబోధించి నదీ ప్రవాహంలా వస్తున్న కోపానికి ఆనకట్ట వేసి, ఆవేశాన్ని అదుపులో పెట్టుకొని, ఆలోచించమన్నది. అంగదుడు గూఢచారుల వలన రామలక్ష్మణులనే అసమాన పరాక్రమవంతులు, ఇక్ష్వాకు వంశీయులు కిష్కింధకు వచ్చి, సుగ్రీవునితో మైత్రి ఏర్పరచుకున్నారని తెలిసిందని చెప్పింది. సుగ్రీవుడు దర్పంగా, గర్జించడానికి వారిమైత్రి బలమే కారణమని విన్నవించుకున్నది.

సాధువు, ఆపన్నుడు, ఆర్తుడైన సుగ్రీవుని సాధుజన రక్షకుడు, ఆపన్న శరణ్యుడు, ఆర్తత్రాణ పరాయణుడు, కీర్తి భాజనుడైన శ్రీరామచంద్రుడు రక్షిస్తాడని వూహించింది. యుక్తియుక్తముగా, సహేతుకంగా యోచించిన తార, తన భర్త మేలు కోరి చెబుతున్నానని, సుగ్రీవుని యువరాజుగా చేసి, తన కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేసుకోమని, తన భర్తను ఉద్దేశించి హితవాక్యములను అనునయంగా, వుపయుక్తంగా పలికింది. కాని, అహంకారం, దర్పము, ప్రతాపాలతో విర్రవీగి విపత్తులనాహ్వానిస్తున్న వాలి, తారాపథాన్ని అందుకునే తార సలహాలకు తిరోదకాలిచ్చి, తెర దించాడు. తాను మహావీరుణ్ణని, సుగ్రీవుడు కయ్యానికి కాలుదువ్వుతుంటే, తాను గాజులు తొడుక్కుని మూల కూర్చునే పిరికిపందను కాదని, సుగ్రీవుణ్ణి సంహరించనని చెప్పి, తారను పక్కకు తప్పుకోమన్నాడు. నిస్సహాయంతో కన్నీరు కారుస్తూ ఆగిపోతుంది తార. వాలి సంహరింపబడ్డాడని తెలిసిన తరువాత నేలకూలిన ప్రదేశానికి వెళ్ళి, భర్త శరీరంపై పడి ఎంతగానో విలపిస్తుంది. అలాంటి మహావీరుణ్ణి ఇటువంటి దయనీయమైన స్థితిలో చూస్తానని ఎప్పుడూ ఊహించలేదు అంటుంది.

కానీ అటువంటి విపత్కర పరిస్థితులలో కూడా తార

సంయమనమును కోల్పోలేదు. సుగ్రీవుణ్ణి దూషించ లేదు. తన భర్త కామ, క్రోధావేశములే అతని పతనానికి కారణమని తెలిసి, పతివ్రతగా రోధిస్తుంది. అందుచేత తన ప్రవర్తనతో తారా పథమును చేరుకొన్న తార సార్థక నామధేయురాలు.

## *చంద్ర కాళీ ప్రసాద అమ్మా!*

- పి. నాగేశ్వరరావు

**ప్రసాదంతో కడుపు నింపి**
**ప్రసంగంతో మనసు నింపి**
**ప్రసన్నంగా చిరునవ్వు నవ్వి**
**ప్రమోదంగా పలుకరించే అమ్మా**
**చంద్ర కాళీ ప్రసాద అమ్మా!**

**మాతాజీవి నువ్వు, అమ్మాజీవి నువ్వు**
**అభినవ మీరవు నువ్వు నవయుగ ధీరవు నువ్వు**
**మమతకు, సమతకు విలాసం నువ్వు**
**మా అందరి ఇలవేలుపువు నువ్వు**

**అలంకారానికి ఆద్యం నువ్వు అనురాగానికి చిహ్నం నువ్వు**
**ఆనందానికి నెలవే నువ్వు ఆకలి తీర్చే అన్నపూర్ణవు నువ్వు**
**మహనీయ మూర్తివి నువ్వు, కమనీయ స్ఫూర్తివి నువ్వు**
**దర్శనీయ మాతవు నువ్వు దయచూపే మూర్తివి నువ్వు**

**మా అమ్మవు నువ్వు మా అమ్మకు అమ్మవు నువ్వు**
**మా అమ్మమ్మకు అమ్మవు నువ్వు**
**ముగురమ్మల మూలపుటమ్మవు నువ్వు**
**అమ్మలకే అమ్మవు నువ్వు జగదంబవు నువ్వు**
**కన్నతల్లివీ నువ్వు కల్పవల్లివీ నువ్వు రంగవల్లివీ నువ్వు**

# గురువు అవసరం

సేకరణ - బొంబాయి కృష్ణారావు

ఓ మహానగరంలో ఓ గురువుగారు తన వద్దకు వచ్చేవారికి ఆధ్యాత్మిక శిక్షణ ఇస్తూ, ధర్మప్రబోధం చేస్తూ వుండేవారు. మహా సంపన్నుడొకడు ఈ గురువుగారి దగ్గరకు వచ్చి 'అసలు గురువు అవసరమా? గురువు లేకుంటే వచ్చిన నష్టమేమిటి?' అని ప్రశ్నించాడు.

గురువుగారు నవ్వుకుని, మీరేం చేస్తుంటారని అడిగాడు. దానికి ఆయన నాకు అతిపెద్ద సూపర్ బజార్ వుంది అని సమాధానం ఇచ్చాడా సంపన్నుడు. అయితే ఒకసారి నన్ను మీ సూపర్ బజార్‌కి తీసుకువెళ్ళమని గురువుగారు అడిగారు. ఇద్దరూ కలిసి సూపర్‌బజార్‌కు వెళ్ళారు.

ఆ రోజు సెలవు కావడంతో నిర్మానుష్యంగా ఉంది. ఏడంతస్థుల పెద్ద భవంతి. అందులో దొరకనిదంటూ వుండదు. దానిని చూసిన గురువుగారు నవ్వుకున్నారు. అక్కడే ఆ సంపన్నుడు కుక్కలను, ఆవులనూ కూడా పెంచుతున్నాడు.

ఆ మందలో నుండి ఒక ఆవును ఆ సూపర్‌బజార్ లోపలికి పంపించమని గురువుగారు కోరాడు. ఆ సంపన్నుడు అలాగే చేశాడు. ఆ ఆవు ఆ బజారంతా తిరుగుతూ తిరుగుతూ, చివరకు ఒక మూల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వున్న పండ్ల దుకాణంలోకి వెళ్ళింది. కడుపునిండా తృప్తిగా మేసింది. రెండు గంటల వ్యవధిలో తిరిగి వచ్చేసింది.

తరువాత అతను పెంచుతున్న కుక్కను లోపలికి ప్రవేశపెట్టమని కోరాడు గురువుగారు. ఆ సంపన్నుడు అలాగే చేశాడు. అది కూడా బజారులో తిరుగుతూ, తిరుగుతూ వాసన చూస్తూ, మూడవ అంతస్థులో మాంసం అమ్మే దుకాణంలోకి వెళ్ళింది. తృప్తిగా తినేసింది. మూడు గంటల వ్యవధిలో అది కూడా తోక ఆడిస్తూ యజమాని దగ్గరకు వచ్చేసింది.

ఈసారి ఒక సామాన్యుడిని పిలిచి, లోపలికి వెళ్ళి నీకు నచ్చిన దానిని తీసుకో అని చెప్పి పంపించారు గురువుగారు. అతడు ఉత్సాహంతో లోపలికి ప్రవేశించి అన్నింటినీ చూసి, ఉక్కిరి బిక్కిరైపోయాడు. ఏం తీసుకోవాలో అర్థం కావటం లేదు. రెండు, మూడు, నాలుగు గంటలు గడిచిపోయినా బయటకు రావడం లేదు. అందరూ ఆశ్చర్యపోయారు.

గురువుగారు యజమానిని కలిసి అతడున్న చోటుకి చేరుకున్నాడు.

నెత్తిమీద చేతులు పెట్టుకుని దిక్కులు చూస్తున్న ఆ వ్యక్తి 'ఏం కావాలో అర్థం కావడం లేదు. ఈ వస్తువులు అన్నీ చూస్తుంటే పిచ్చెక్కిపోతోంది, ఏది తీసుకోవాలో తెలియడం లేదు' అన్నాడా వ్యక్తి. దీనిని విన్న ఆ సంపన్నుడు అవాక్కైపోయాడు!

అప్పుడు గురువుగారు మాట్లాడుతూ 'ఆవుకీ, కుక్కకీ పిచ్చెక్కలేదు. వాటికి ఏం కావాలో వెతుక్కుని తృప్తిగా ఆరగించి వచ్చాయి. మనిషికి మాత్రం ఏం కావాలో తనకే తెలియలేదు. అన్నీ తనకే తెలుసనుకుంటాడు పాపం! అందుకే వీడికి గురువు కావాలి. ఎలా జీవించాలో, జీవిత ఔన్నత్యాన్ని ఎలా పొందాలో తెలుసుకోవాలి. అందుకే వాటిని తెలియజెప్పే గురువు అత్యంత అవసరమ'ని చెప్పడంతో యజమానికి అర్థమై ధన గర్వం తొలగింది. గురువుతోనే గమ్యం సాధ్యమని తెలుసుకున్నాడు.

## గమనిక

*మేము పంపించిన సమర్థ సద్గురు మాసపత్రిక ప్రతులు కొన్ని తరచుగా మాకు తిరిగి వస్తున్నాయి. కాబట్టి దయచేసి పుస్తకం వెనకాల ముద్రించిన మీ చిరునామా సరిచూసుకోగలరు. ఏమైనా మార్పులు చేర్పులు వున్నట్లయితే మొదటిపేజీలో వున్న మా ఫోన్ నెంబరుకు ఫోన్‌చేసి మార్పించుకోగలరు. మేము ప్రతినెలా 5, 6 తేదీలలో పుస్తకాలు పోస్ట్ చేస్తాము. 15వ తేదీలోగా మీకు పుస్తకం చేరనట్లయితే ముందుగా మీ పోస్టాఫీస్‌లో సంప్రదించి, తరువాత మాకు తెలియజేయగలరు! దయచేసి మీ బంధుమిత్రులకు కూడా ఈ సమాచారాన్ని అందజేయగలరు!!*

# తెలివైన చిలుక

సేకరణ - భీమవరం గుప్తా

ఒక వ్యక్తి పట్టణంలో జరుగుతున్న సత్సంగానికి ప్రతిరోజూ వెడుతూ వుండేవాడు. ఆ వ్యక్తి తన ఇంట్లో ఒక చిలుకను పంజరంలో పెట్టి పోషిస్తూ వుండేవాడు. ఒక రోజు ఆ చిలుక తన యజమానిని 'మీరు రోజూ ఎక్కడకు వెడుతున్నారు?' అని అడిగింది. అతను 'మంచి విషయాలు తెలుసుకోవడానికి నేను సత్సంగానికి వెడుతున్నా' అని చెప్పాడు. తిరిగి ఆ చిలుక 'మీరు నాకు ఒక సహాయం చేయగలరా? నేను జీవితంలో ఎప్పుడు స్వేచ్ఛ పొందగలనో మీరు మీ గురువుగారిని అడిగి నాకు చెప్పగలరా? ' అని అడిగింది. దానికి అతను సరే అన్నాడు.

మరుసటి రోజు అతను సత్సంగానికి వెళ్ళాడు. కార్యక్రమం ముగిసిన తరువాత, అతను తన గురువు దగ్గరకు వెళ్ళి వినయంగా 'గురుమహరాజ్! మా ఇంట్లో ఒక చిలుక వున్నది. అది స్వేచ్ఛను ఎప్పుడు పొందగలదో మిమ్మల్ని అడిగి తెలుసుకురమ్మనమని ప్రాధేయపడింది' అని చెప్పాడు. అది విన్నవెంటనే గురువుగారు అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. ఇది చూసిన ఆ యజమాని భయపడి నెమ్మదిగా బయటకు వచ్చేశాడు. నెమ్మదిగా అతను ఇంటికి చేరుకున్నాడు. రాగానే అతని చిలుక 'మీరు నా ప్రశ్నను మీ గురువుగారిని అడిగారా? ఆయన ఏమన్నారు?' అని అతనిని ఎంతో ఆవేదనగా అడిగింది.

దానికి యజమాని 'నేను అడిగాను. కానీ నీ అదృష్టం బాగుండలేదు. నేను నీ ప్రశ్న అడిగిన వెంటనే, మా గురువుగారు అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయారు. ఏమీ మాట్లాడలేదు' అని సమాధానం చెప్పాడు. ఆ చిలుక వెంటనే 'సరే సరే నేను అర్థం చేసుకున్నాను' అన్నది.

ఆ మరునాడు ఆ యజమాని సత్సంగానికి వెళ్ళబోతూ, పంజరంలో తన చిలుక అపస్మారక స్థితిలో వుండటాన్ని చూశాడు. యజమాని పరీక్షగా చూసి అది చనిపోయిందనుకుని పంజరం లోనుండి దాన్ని బయటకు తీసి నేలమీద వుంచాడు. అంతలో అది రివ్వున పైకి ఎగిరిపోయింది. చేసేది లేక అతను మామూలుగా సత్సంగానికి వెళ్ళాడు.

గురువుగారు అతన్ని చూసి దగ్గరకు పిలిచి 'నీ చిలుక ఎక్కడ వున్నది?' అని ప్రశ్నించాడు. దానికి సమాధానంగా ఆ యజమాని, 'నేను ఉదయం సత్సంగానికి బయలుదేరేటప్పుడు అది పంజరంలో అపస్మారక స్థితిలో పడి వున్నది. దాని ఆరోగ్యం తనిఖీ చేయడానికి నేను బయటకు తీసి, నేలమీద వుంచగానే అది రివ్వున గాలిలోకి ఎగిరి పోయింది' అని దిగులుగా చెప్పాడు.

గురువుగారు నవ్వుతూ 'మీ చిట్టి చిలుక మీ కంటే తెలివిగలది. అది నేను ఇచ్చిన చిన్న సందేశాన్ని అర్థం చేసుకుని ఆచరణలో పెట్టి, స్వేచ్ఛను పొందగలిగింది. కానీ మీరు మటుకు చాలా రోజుల నుండి సత్సంగానికి వస్తూ కూడా సాధన చేయకుండా, భ్రమలో పడి ఈ ప్రపంచమనే పంజరంలో ఇరుక్కుని ఉన్నారు' అన్నారు. దానికి ఆ యజమాని సిగ్గుతో తలవంచుకున్నాడు. ఆకాశంలో దూరం నుండే ఆ చిలుక గురువుగారికి కృతజ్ఞతలు తెలుపుకున్నది.

సత్సంగం యొక్క ఉద్దేశం కేవలం భక్తి కోసం కాదు. అజ్ఞానం నుండి అంధకారం నుండి భ్రమల నుండి మనం బయటపడి స్వేచ్ఛగా విముక్తులమై దైవాన్ని చేరుకోవడం కోసమని గ్రహించాలి!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఏప్రియల్, మే 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఏప్రియల్ 2020***: AS 5127, 7110, 7112, 7114, 7115, 7463, 7499, 8014, 8015, 8017, 8020, 8021, 8024, 8030,8032.

***మే 2020:*** AS 4696, 6069, 7069, 7124, 7127, 7775, 8037, 8039 నుండి 8055, 8058 నుండి 8135, 8137.

# శ్రీ సద్గురు వాణి

సేకరణ - డా॥ రాఘవేంద్ర రావు. పి.

16-10-1980

'శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమై ఆరు రోజులు అయింది. ఇది ఏడవ రోజు. షట్చక్రాలను దాటిపోయాము. షడ్గుణాలు హరించిపోయాయి. ఏడోది సహస్రారంలోకి ప్రవేశిస్తున్నాము. ఆ జనని నామం తియ్యనైనది. ఆ నామంతో కలిపి తీసుకునే ఆవిడ పాదతీర్థము జ్ఞాన, విజ్ఞాన యోగానుభవము కలిగించేది. ఆ తల్లి జ్ఞాన తేజస్సు అనంత శక్తి స్వరూపము. ఆ కమనీయాకృతము చూసే కొలది, ఇంద్రియాలన్నీ పులకించిపోతాయి. ఆ తల్లి రూపంలో నుంచి వచ్చే ఆనంద కిరణాలు చూసి భక్తుడు ఆనందాన్ని పొందుతాడు. అటువంటి కమనీయాకృతం ఆ తల్లిది.

అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్లు, ఆ జీవుడు ఎంత సంసార సంకటములలో వున్నప్పటికీ, ఆదరణ, ప్రేమతో ఆకర్షించి తన స్పర్శ, తన రూపమును దర్శించుట వలన ఆ జీవుడికి ఎడతెగని తాపము, దుఃఖము హరింపజేసి, శాంతిని, సుఖాన్ని, ఆనందాన్ని ఇస్తుంది అమ్మ.

ఈ సంసారమనే సాగరంలో కెరటం వెంట కెరటం ఆపులేకుండా వస్తాయి. మొదటిది తప్పించుకుంటే రెండోది వచ్చి పడేసి లాక్కుపోయే టందుకు చూస్తుంది. ఆ నీళ్ళు కళ్ళల్లోకి, ముక్కులోకి దూరి ఇబ్బంది పడినప్పటికీ, పడుతూ లేస్తూ, ఎన్నో కష్టాలు పడుతూ ఈ సంసార సాగర సుడిగుండంలో మునిగిపోతున్నాడు జీవుడు. ఆ సమయంలోనే అచంచలమైన భక్తి విశ్వాసాలతో ఆ జగజ్జనని దివ్యచరణార విందములను విడవకుండా పట్టుకుంటే ఈ భవసాగరం నుండి అమ్మ రక్షిస్తుంది. ఈ కమనీయాకృతి కలిగిన తేజస్సు, తియ్యటి రూపం, అఖండ జ్యోతి స్వరూపము సర్వ ప్రకృతి హృదయాలకు కాంతినిచ్చేటటువంటి అనంతశక్తి స్వరూపిణి.

ఏదైనా తింటే కంటికి కనిపిస్తుందా? కనిపించదు. ఈ కమనీయాకృతి కలిగి బ్రహ్మపదార్థ స్వరూపురాలైన జనని దర్శనం పొంది, ఆ ఆకృతిలో మునిగి ఆనందం పొందటమే ఆత్మదర్శనం. దశేంద్రియములు అవీ ఇవీ అననేల సమస్త ఇంద్రియాలకు ఆనందాన్నిస్తుంది. అఖండమైన చల్లని కాంతి, కమనీయాకృతమైన

చల్లని దృష్టిగల ఆ తల్లి నేత్రములు ఎంతో విశాలమైనవి. సమస్త ప్రపంచానికి చల్లని వెలుగునిస్తూ, ఆదరణ, ప్రేమతో నింపుతుంది. మా అమ్మ జగజ్జనని దర్శనం అయస్కాంతంలాగా మానవుని దశేంద్రియాలకు శాంతిని ఇస్తుంది.

శాస్త్రములేవీ అందించలేని ఆనందాన్ని అమ్మ అందిస్తుంది. 'అమ్మ' - బ్రహ్మామృతము కలిగిన నామము. సకలజీవకోటికి దాచకుండా, స్వార్థ రహితంగా బ్రహ్మామృతమును ధారపోస్తుంది. జీవుడికి ప్రారబ్ధ కర్మను బట్టి ఎప్పుడు ఏదేది అందించాలో అది అందిస్తుంది. ఆవిడ యందు మనస్సు నిలపడమే మన కర్తవ్యము.

-సశేషం

## సర్వదేవతా స్వరూపులు శ్రీబాబు

కరోనా విపత్తు మహమ్మారి నుండి దేశరక్షణ కొరకు, విశ్వశాంతి కొరకు, ప్రజా క్షేమం నిమిత్తమై నంబూరు, శ్రీ కాళీవనాశ్రమం నందు 20-3-2020 నుండి 30-3-2020 వరకు 11 రోజులు త్రిమాతా స్వరూపిణి, అభినవ లలిత చంద్రకాళీమాత మాచేత '***దేవీ పంచాయతన యాగం***' చేయించారు. కరోనా విపత్తు నివారణకై బహుశ ఇదే మొదటి యాగమేమో. ఇంతటి యాగంలో ఋత్విక్‌గా పాల్గొనడం నా అదృష్టం. ప్రతి నిత్యమూ దర్బారు సేవ, చతుర్వేద పఠనం అనంతరం మాతాజీ అనుగ్రహ భాషణం చేస్తూ వున్నంత సేపూ హనుమత్ కాళీ వర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి పటము చూస్తూవున్న నాకు శ్రీబాబు శ్రీవేంకటేశ్వర స్వామిగా దర్శనమిచ్చి నన్ను చరితార్థుని చేశారు.

ఆ సమయంలో నేను మంగళగిరి వద్ద వున్న బాబుగారి ఆశ్రమంలో వున్నప్పటికీ నాకు సప్తగిరి నివాసుని వద్ద వున్న అనుభూతి కలిగింది. ***నమోవాఙ్మనసాతీతా*** అన్న శ్లోకానికి అర్థం వర్ణించడానికి వాక్కు సరిపోదు, ఊహకు మనసు సరిపోదు అన్న నారద మహర్షి వర్ణన యదార్థమైనది. ***సంభవామి యుగేయుగే*** అనగా కృత, త్రేత, ద్వాపర, కలియుగములు అంటారు. కానీ ఒక మనిషి జీవితం ఒక యుగం. కాబట్టి నా జీవిత యుగంలో ఇది నాకు సంభవమైనది.

- ఋత్విక్ శ్రీ రవి గారు

# వాదిరాజ స్వామి

- మహేష్

మధ్వమతానికి చెందిన వాదిరాజ స్వామి మహాభక్తుడు. అతడు మఠాధిపతి కూడా. ప్రతిరోజూ అతను దేవాలయంలోకి ప్రసాదం తీసుకుని వెళ్ళి తన ఇష్టదైవమైన హయగ్రీవునికి నివేదన చేస్తూ వుండేవాడు. వాదిరాజ స్వామి భక్తికి హయగ్రీవస్వామి ఎంతగానో సంతోషించేవాడు. అతను ప్రసాదం గిన్నె నెత్తి మీద పెట్టుకుని కూర్చోగానే, హయగ్రీవుడు గుఱ్ఱం ఆకారంలో వచ్చి, అతని రెండు భుజాలమీద రెండు కాళ్ళూ ఆన్చి, ప్రసాదాన్ని కొంచెం తినేవాడు.

ఇలా కొన్నాళ్ళు జరిగేసరికి, ఆ మఠంలోని ఇతర భక్తులు వాదిరాజ స్వామి ప్రసాదం తీసుకుని గుడిలోకి వెళ్ళి, మళ్ళీ బయటకు వచ్చేసరికి తలమీద వున్న గిన్నెలోని ప్రసాదం కొంత తగ్గుతూ వుండటం గమనించారు. ఈయనే గుడిలో కూర్చుని కొంత ప్రసాదం తినేస్తున్నాడు అని భావించి, ఆయనకు తగిన గుణపాఠం చెప్పాలి అనుకున్నారు.

ఒకరోజు ఆ మఠంలోని వారందరూ కలసి, వాదిరాజస్వామి గుడిలోకి నైవేద్యం పెట్టడానికి తీసుకువెళ్ళే ప్రసాదంలో చాటుగుండా కొంత విషం కలిపారు. ఈ విషయం వాదిరాజస్వామికి తెలియదు. అతను మామూలుగానే ఆ ప్రసాదం గిన్నెను దేవాలయంలోకి తీసుకువెళ్ళి తన తల మీద పెట్టుకుని కూర్చున్నాడు. వెంటనే హయగ్రీవుడు గుఱ్ఱం ఆకారంలో వచ్చి, ఆ ప్రసాదం మొత్తమంతా తినేశాడు.

వాదిరాజస్వామి కొంచెం సేపు అయిన తరువాత తలమీద గిన్నె క్రిందకి దించి చూసేసరికి, అందులో ప్రసాదం లేదు. ఈ వేళ స్వామి తనకు ఎందుకు ప్రసాదం అనుగ్రహించలేదు? తాను ఏం పాపం చేశానో? అని విచారిస్తూ అతను ఖాళీగిన్నె పట్టుకుని బయటకు వచ్చాడు. తిరిగి వచ్చిన అతనిని చూసి, మిగతావారు ఆశ్చర్యపోయి, 'ప్రసాదం ఏది?' అని ప్రశ్నించారు. దానికి అతడు 'ఈవేళ ప్రసాదమంతా ఆ హయగ్రీవుడే ఆరగించేశాడు. మనకు ప్రసాదం మిగలలేదు' అని విచారంగా చెప్పాడు వాదిరాజస్వామి.

ఆ మాటలకు మరింత ఆశ్చర్యపోయిన భక్తులందరూ కలసి గర్భగుడిలోకి వెళ్ళారు. లోపల విగ్రహం అంతా నల్లగా మాడిపోయి వున్నది.

వెంటనే అందరూ తిరిగి బయటకు వచ్చి, వాదిరాజస్వామి కాళ్ళమీద పడి తాము చేసిన తప్పును చెప్పేశారు.

తన చేతులతో తాను స్వయంగా స్వామికి విషాన్నం పెట్టాను కదా అని ఆ భక్తుడు విలవిలలాడిపోయాడు! ఆ రాత్రి వాదిరాజస్వామి కలలో హయగ్రీవుడు దర్శనమిచ్చి, 'ఇవిగో వంగ విత్తనాలు. వీటిని పాతిపెట్టి, ఈ మొక్కలకు కాసిన వంకాయలను 48రోజుల పాటు నాకు నివేదన చేస్తే నాకు కలిగిన యీ నలుపురంగు పోతుంది. ఈ జరిగిన సంఘటనలో నీ దోషమేమీ లేదు. నీవు అమాయకుడవు' అని చెప్పి అదృశ్యమయ్యాడు.

వాదిరాజ స్వామి మేల్కొని చూసేసరికి అతని చేతిలో నిజంగానే వంగ విత్తనాలు వున్నాయి. భగవదాజ్ఞ ప్రకారం వాటిని పాతిపెట్టి, వాటికి కాసిన వంకాయలను వరుసగా 48రోజులు స్వామికి నివేదన చేయగా స్వామి విగ్రహం మెల్ల మెల్లగా నలుపురంగు పోయి, మళ్ళీ పూర్వపు రంగులో ప్రకాశించింది. వాదిరాజస్వామిని భక్తులందరూ వేనోళ్ళ కొనియాడారు!!

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన పెండికట్ల ఉమా మహేశ్వరరావుగారు (ఉమా మాస్టారు) 6-3-2020 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 42 సంవత్సరాలు. వీరు ఆశ్రమ పాఠశాలకు, సద్గురు యువసేవా సమితికే కాక, ఆశ్రమంలో అనేక ఇతర సేవలను అందించారు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.


అసలు నిజం
మధుప
మనం కూడా తొందరగా ఒక మంచి ఇల్లు కట్టుకోవాలి
1


ఈ అరటి బోదెలు భలే నున్నగా, అందంగా ఉన్నాయి. వీటితోనే మనం తేలికగా , ఖర్చు లేకుండా ఇల్లు కట్టుకోవచ్చు
2


కానివ్వండి త్వరగా!
3


అసలిందులో ఏముందో చూద్దాం!
4


ఇందులో ఎన్ని పొరలు తీసినా లోపల ఏమీ లేదు!
5


అయ్యయ్యో! చిన్న గాలివానకే మనం కట్టిన ఇల్లంతా కూలిపోయిందే!
6


ఈ అరటి బోదెలు నిలబడలేవని నేను ముందే తెలుసుకున్నాను. ఇందులో ఏడవటానికి ఏమీ లేదు.
7


ఆ అరటి బోదెల్లలాగే ఈ ప్రపంచంలో ఏదీ శాశ్వతం కాదు. అన్నీ ఏదో ఒకనాడు పోయేవే. స్వయంగా పరిశోధన చేసి ఈ అసలు నిజాన్ని తెలుసుకున్నవాడు అవి పోయినా ఆనందంగానే ఉంటాడు. తెలుసుకోలేనివాడు దుఃఖిస్తాడు.
8

# సాధనే ముక్తికి మార్గం

(గత సంచిక తరువాయి) - వి. రవి కుమార్

ఈ ప్రశ్నల పరమార్థం ఒకవేళ వీరిరువురు బ్రహ్మజ్ఞాన సంపన్నులైతే వారి వద్ద నుండి బ్రహ్మోపదేశం పొంది తాను ముక్తిని పొందడం. ఈ రాక్షసి ప్రశ్నలకు వారిద్దరూ ఏమాత్రం భయపడలేదు. మంత్రిగారు సమాధానం చెబుతూ, 'నీవు పరమాత్మ తత్వానికి చెందిన పలు ప్రశ్నలు వేశావు. వాటికి నేను సమాధానం చెబుతాను విను... 1. ఆ వస్తువు 'పరమాత్మ' ఎందుకంటే పరమాత్మ నుంచి అన్ని బ్రహ్మాండాలు వుద్భవిస్తున్నాయి. కనుక ఆయన ఒక సముద్రంలాంటివాడు. ఆయన నుండి అనేక బ్రహ్మాండాలు బుడగల వలే ఉద్భవిస్తూ, అంతరిస్తూ వున్నాయి.
2. ఒక ఆవగింజంతటి విత్తులో బ్రహ్మాండమైన మఱ్ఱిచెట్టు దాగి వున్నట్లుగా, ఈ పరమాత్మ నుంచి కోట్లాది జీవులు బ్రహ్మాండాలు ఉద్భవిస్తున్నాయి. పరబ్రహ్మము, పరమాత్మ ఈ జగత్తుకు సత్తా మూలాధారము.

రాజు గారు సమాధానం చెబుతూ ... మనిషి జాగ్రత్ స్వప్న సుషుప్తి మూడు అవస్థలలో జీవిస్తూ వుంటాడు. ఈ మూడూ దాటాక తురీయమనే అవస్థ వున్నది. తురీయమే ఈ మూడు అవస్థలను దాటి వీటికి అనుగుణంగా వుంటూ సాక్షిగా వుండేది. ఏ చిత్తం ఇట్టి చిత్వదార్థాన్ని ఆశ్రయించి వుంటుందో, ఆ చిత్తం అన్ని సంకల్ప వికల్పాలను విడిచి పెడుతుంది.

నాకు సత్తా ఆ పరబ్రహ్మమే. నేనే ఆ పరబ్రహ్మ వస్తువును. ఈ ప్రపంచమంతా కనిపిస్తోంది కాని నిజంగా అది లేదు. ఆత్మ వస్తువుకి సృష్టి స్థితి లయలు లేవు. ఈ ప్రపంచమంతా ఒక స్వప్నం. అంటే ఇదంతా ఆ పరమాత్మ పిండము. కనుక నేను చేస్తున్నాననే భావన లేదు. చేసేది, చేయించేది, చేయబడేది మొత్తం పరబ్రహ్మమై వున్నది' అని చెప్పగానే కర్కటి ఆశ్చర్యం పట్టరానిదైపోయింది. ఆనంద పరవశాన్ని పొందినది. ఆమె ఆ రాజును మంత్రిని అభినందించింది. మీ ఇద్దరికీ ఏం కావాలో కోరుకోండి అని అడిగింది వారిని.

అప్పుడు ఆ రాజు 'మా రాజ్యంలో విషూచికా వ్యాధి వల్ల చాలామంది చనిపోతున్నారు. దాని నివారణకు ఎవరైనా మహాత్ములు

కనిపిస్తారేమో అని తిరుగుతుంటే ఆ వ్యాధి రూపమైన నీవే దర్శనం ఇచ్చావు. కనుక ఆ వ్యాధి నివారణకు మార్గం చూపించు. ఏ జీవిని హింసించనని మాట ఇవ్వు' అన్నాడు. 'తథాస్తు!' అన్నది కర్కటి. ఆమెకు ఏ మాత్రం కోపం కలుగలేదు. ఈసారి రాజు ఆశ్చర్యపోయి తేరుకుని 'ఓ రాక్షసీ! ఇంతకాలం రక్తమాంసాలు పీక్కు తింటూ బ్రతికావు. ఒక్కసారి అహింసా ప్రతిజ్ఞ చేస్తే ఎలా! మరి నువ్వు బ్రతికే మార్గం ఏమిటి?' అని ప్రశ్నించాడు.

ఆ రాక్షసి 'కొన్ని నెలలుగా కొండపై తపస్సులో వుండి ఇప్పుడే లేచాను. పూర్వ కర్మబలం వలన తిందామనే సంకల్పం కలిగింది. కాని పుణ్య బలం లేకపోవటం వలన అది తీరలేదు. కాని మీలాంటి సత్పురుషుల సాంగత్యం లభించింది కనుక ఆహార చింతన మానివేసి మళ్ళీ ధ్యానంలో ప్రవేశిస్తాను. ఆ ధ్యానంలోనే ఈ శరీరాన్ని వదిలేస్తాను అంతేగాని పరహింస చేయనే చేయను. రాజా! నువ్వు దివ్యదృష్టితో నేను విషూచికా వ్యాధినని గ్రహించావు. కాని నా పేరు కర్కటి. రాజా! బ్రహ్మ నాకు విషూచికా మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని మీ ఇద్దరికీ ఉపదేశం చేస్తాను' అని చెప్పి వారిద్దరినీ నదీతీరానికి తీసుకువెళ్ళి అక్కడ ఉపదేశించింది.

'రాజా! ఇక నేను వెడతాను' అనగానే, రాజు 'అమ్మా! నువ్వు ఇప్పుడు స్నేహితురాలివే కాక, గురువు కూడా అయ్యావు. కనుక నా ఆతిథ్యం తీసుకోకుండా వెళ్ళవద్దు. మీరు మా విన్నపాన్ని స్వీకరించి, మా దేశపు పెద్ద ముత్తయిదువు లాగా రూపం మార్చుకుని, మా ఇంటికి రావాలి' అని కోరాడు. దానికి ఆ రాక్షసి నవ్వి, 'ఓ రాజా! రూపం మారిస్తే నా అసలు రూపం ఏమవుతుంది? నా ఆకలి ఏమవుతుంది? నేను రాక్షసిగా జన్మించాను. మరణించేదాకా రాక్షసి లాగే జీవిస్తాను. రక్తమాంసాలే తింటాను. నేను నీ శాకాహారం భుజించలేను. దానికన్నా పస్తులుండటం మేలు' అన్నది.

-సశేషం

# వాహనము - వేదన

- జి. శైలజ

'ఆశ్చర్యపోతున్నారా! జడమైన వాహనమునకు వేదన ఏమిటా?' అని. మీలో చైతన్యము లేకపోతే మీరూ జడులే కదా! అలనాడు రాతిని నాతిగా చేసిన ప్రభువు మీకు గుర్తు రావటం లేదా? కోతికి శాస్త్రములు నేర్పినవాడు, దున్నపోతు చేత వేదములు పలికించినవాడు, చాకలికి వేదములు నేర్పినవాడు, ఆ ప్రభువే నాకు ఈ నాడు గురు రూపంలో వచ్చి, నాకు చైతన్య స్ఫురణను కలిగించారు. మీకు అంతఃకరణ చతుష్టయం ఎలాగో, నాకూ నాలుగు చక్రాలున్నాయి. ఈ చక్రాలు ఒకదానితో ఒకటి సహకరించక పోయినచో నా ఒడిలో కూర్చున్నవారికి చాలా ప్రమాదం. మనలో కూడా అంతఃకరణ చతుష్టయం (మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం) ఒకదానితో ఒకటి సహకరించకపోయినచో శరీరం అనే బండికి ప్రమాదము. మన జీవన సారథికి ఆ గురుదేవులు ఎలాగో నేను కూడా గురువుగారిచే వాడబడిన వాహనమును.

నేను పశ్చిమ జర్మనీలో పుట్టాను. నా పేరు మెర్సిడెస్ బెంజ్. నన్ను ఒకరోజు ఒక భారతీయ భక్తుడు కొన్నాడు. వారింటికి గురుదేవులు ఒకసారి వచ్చారు. అప్పుడు వారు 'బాబూజీ! ఈ బెంజ్‌కారు మీ కోసం కొన్నాను' అన్నారు. 'ఎందుకు కొన్నావు? ఎవరిని అడిగి కొన్నావు? గురువులు అంటే శిష్యుల చేత వస్తువాహనాలు కొనిపించే వారనుకున్నావా? లేక మీకు దారి చూపెడివారు అనుకొన్నావా?' అని అడిగారు. అప్పుడా భక్తుడు బాబూజీ పాదాలపై పడి కన్నీళ్లతో ఇలా ప్రార్థించాడు. 'మీరు భక్తులను చూడటానికి, పుణ్యక్షేత్రాలు తిరగడానికి ఒక వాహనం కావాలనే ఉద్దేశంతో కొన్నాను' అన్నాడు. అప్పుడు బాబూజీ 'సన్యాసులము మేము ఇటువంటి వాహనములలో తిరిగితే ప్రజలు మమ్మల్ని విశ్వసిస్తారా?' అన్నారు. 'విశ్వసించేవాళ్ళు ఎప్పుడూ తమ విశ్వాసాన్ని పోగొట్టుకోలేరు. అలాగే అనుమానించేవాళ్ళు శ్రీకృష్ణుని కాలం నుండీ ఉన్నారు' అని ఆ భక్తుడు అన్నాడు.

'అయినా బ్రహ్మచారిని నాకెందుకయ్యా! ఇది వుంటే దాని సంరక్షణ కోసం మనుష్యులు కావాలి. చివరకు 'కౌపీనం కథ'లాగా అవుతుంది. నన్ను ఈ జంజాటంలో దించకయ్యా!' అన్నారు శ్రీబాబు. అప్పుడా భక్తుడు వినయంతో 'బాబూజీ! మీ దగ్గర వుండి సేవ చేయాలంటే

నా వృత్తిరీత్యా నేను రాలేను. కనీసం ఈ వాహనమును మీ సేవకు వినియోగిస్తే నేను ఆనందభరితుడనౌతాను' అన్నాడు. అలా బాబూజీ ఆ భక్తుని పరీక్షించి, అతని మనస్సు గ్రహించి, తీసుకోవడానికి అనుగ్రహించారు. వాదోపవాదాల అనంతరం బాబూజీ బయటకు వచ్చి నన్ను ప్రేమతో తమ హస్త స్పర్శచే నన్ను పునీతుణ్ణి చేశారు. ఆ గురుదేవుల స్పర్శచేత నా మేను పులకించిపోయింది. ఆయన నా ఒడిలో కూర్చుని ఒక్కసారిగా నాలో చైతన్యం కలిగించారు.

ఒడలు మరచిన నన్ను ఓడనెక్కించారు. చివరకు భారత గడ్డపై వచ్చిపడ్డాను. ఎన్నో కష్టములకు ఓర్చి, చివరకు నంబూరులో ఉన్న ఆశ్రమం చేరాను. పురుషోత్తముడైన గురుదేవుని ఆశ్రమంలో అడుగు పెట్టగానే నా మేను పులకించిపోయింది.

గురుదేవులు ఎక్కడకు వెళ్ళినా నన్ను తీసుకుని వెళ్ళేవారు. ఎన్నో పుణ్యక్షేత్రాలను, ఎందరో భక్తులను దర్శించాను. ఆయన ప్రేమను, అనుగ్రహాన్ని పొందాను. ఇంకేమి కావాలి? అనుకున్నాను. ఛ్ఛ్! కొద్దిరోజులే ఆ ఆనందం నిలిచింది. మిగిలినది దుఃఖమే. ఏమని చెప్పను? ఎలా చెప్పను? ఒకనాడు గురుదేవులు భౌతికంగా లేరని తెలిసింది. ఆశ్రమం అంతా దుఃఖ సముద్రంలో వున్నారు. ఎవరు నన్ను ఓదార్చేవారు? ఇది ఘోర దుర్వార్త! నేను దుఃఖంలో మునిగిపోయాను. గురుదేవునికి జీవరాశుల భాషే కాదు, జడమైన మా భాష, బాధలు కూడా తెలుసు. ఆయన ప్రేమను ఇప్పుడు ఎలా పొందాలి? అని ఇప్పటికీ బాధ పడుతున్నాను. నన్ను పలుకరించేవారు లేరు. శ్రీమాతాజీ పీఠాధిపతిగా వచ్చి నన్ను అనునయిస్తూ, నా చేత కొద్దిపాటి సేవలు చేయించుకున్నారు. అనేక సత్సంగ కార్యక్రమాలలో పాల్గొన్నాను. ఈ విధంగా నా జన్మ తరించింది అని భావిస్తాను. భక్తులు కూడా నిర్వికార భావనతో సేవచేసి తరించాలని నా కోరిక.

పని లేకపోతే రోగగ్రస్తుడను అవుతాను. ఇంగ్లీషులో ఒక సామెత లాగా 'Rest is rust of our brains' అని అలాగే నాకు Rest ఎక్కువైతే rust పట్టిపోతాను. అప్పుడు నా యజమాని ఎంత దుఃఖిస్తారో కదా! అయినా గురుదేవుల కోసం తపించి, తపించి, rust పట్టి ఆ ఆశ్రమ మట్టిలో కలసిపోతాను. అంటే గురుదేవునిలో లీనమైపోతాను. నా యజమాని (శ్రీబాబు) కోరిక తీర్చినదానిని అవుతాను.

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

క్షమామండలే భూప భూపాల బృందైః ।
సదా సేవితం యస్య పాదారవిందం ॥
గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం ।
**తతఃకిం తతఃకిం తతఃకిం తతఃకిం ॥**

ఈ భూమండలాన్ని పరిపాలించే చక్రవర్తి అయినప్పటికీ, పాదాక్రాంతులైన ఎంతోమంది రాజుల బృందాలతో నిత్యమూ సేవింపబడినప్పటికీ, గురు చరణముల మీద మనస్సు నిలుపలేని వాని జీవితం వ్యర్థమని ఈ శ్లోకం యొక్క సారాంశం. శంకరులు ఈ శ్లోకంలో చాలా అమూల్యమైన విషయాలను నిక్షేపించారు.

శంకరుల శివకేశవ అభేద తత్త్వానికి ఈ అష్టకము ఒక చిన్న మచ్చు తునక. మనం ముందు వివరించుకున్నట్లు మొదటి శ్లోకంలో ఆయన లక్ష్మీనారాయణుల గురించి ప్రస్తావించారు. అలాగే ఈ శ్లోకంలో కూడా 'క్షమా మండలము' అంటూ క్షమా గుణానికి ప్రతిరూపమైన భూదేవిని, 'భూప' అనే పదముతో భూపతియైన విష్ణుమూర్తిని గురించి ప్రస్తావించారు. అంతేకాక దశావతారాలలో ఒకటైన యజ్ఞవరాహ రూపంలో భూమాతను విష్ణుమూర్తి కాపాడిన వృత్తాంతాన్ని కూడా ఈ ప్రస్తావన గుర్తుచేస్తోందా అనిపిస్తోంది.

అయితే 'యస్య పాదారవిందమ్' అనే విషయం సాధకులకు పనికివచ్చే లోతైన వివరాన్ని తెలుపుతోంది. ఎంతోమంది రారాజులతో సదా సేవింపబడుతున్న చక్రవర్తి కూడా ఆ నమస్కారములు తనకు చెందినవిగా భావించకుండా 'యస్య' - ఎవరి వలన అయితే తనకు కీర్తి ప్రతిష్ఠలు కలిగాయో - వారికే అవి చెందినవని భావించినట్లయితే తరిస్తారు. ఈ విషయంలో ఎంతో మంది మహాత్ములు మనకు నిదర్శనాలు చూపిస్తూ వారికి చేసిన నమస్కారములను 'సర్వదేవ నమస్కారం కేశవం ప్రతి గచ్ఛతి' అన్న విధంగా భగవదర్పితం చేశారు. కులశేఖరాళ్వారు ముకుంద మాలలో "త్వద్భృత్య భృత్య పరిచారక భృత్య భృత్య భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ!" అంటూ తనను భగవంతుని దాసానుదాసునిగా

గుర్తించమని వేడుకున్నారు. శ్రీబాబూజీ మహరాజ్ ఈ పంక్తులను ఎంతో ఇష్టంగా పలుమార్లు చెప్పించుకునేవారు.

మరి నిజమైన 'పాదారవిందము'ను గ్రహించినవారిలో తాము చక్రవర్తులయినా, ఎంతో వినమ్రతతో అతిసాధారణంగా వ్యవహరించిన వారు వున్నారు. భరతుడు శ్రీరామపాదుకలను సింహాసనంపై అధిష్ఠింప జేసి, రాజ్యపాలన చేశాడు. శివాజీమహరాజ్ కూడా తమ గురువులైన సమర్థ రామదాసువారి పాదుకలను సింహాసనంపై వుంచి, కేవలం సాక్షీ మాత్రంగా రాజ్యాన్ని పరిపాలించాడు.

అలాంటి అద్వైత సామ్రాజ్య చక్రవర్తులైన గురుదేవులను ఆశ్రయించ గలిగినప్పుడే నిజమైన సార్వభౌమత్వానికి సాధకులు వారసులు కాగలుగుతారని ఈ శ్లోకం తెలవిస్తోంది.

-సశేషం

*ప్రేమాస్పదురాలైన 'తల్లి' చెప్పేదాకా తండ్రి ఎవరో తెలియదు. కంటికి కనిపిస్తూ, పోషిస్తున్నప్పటికీ, 'తల్లి' చెప్పిన తరువాత ఆయన 'తండ్రి' అనే విశ్వాసం అంకురిస్తుంది. అప్పుడే ఆయన పట్ల భయ భక్తులను, గౌరవాన్ని వ్యక్తం చేయడం మొదలవుతుంది. తల్లి చెప్పక పోతే 'తండ్రి' ఎవరో ఎలా తెలుస్తుంది?*

*కంటికి కనిపించే తండ్రి గురించి తల్లి చెబితేగాని యదార్థ జ్ఞానం కలగదు. అటువంటప్పుడు కన్నులకు కానరాని లోక జనకుడు, సృష్టి కర్త, సర్వవ్యాపియైన ఆ భగవంతుని గురించి అసలైన జ్ఞానాన్ని మనకు ఎవరు అందిస్తారు?*

*ఇంకెవరు?? చీకటి నుంచి వెలుగువైపుకు నడిపించే సద్గురువే భగవత్సంబంధిత జ్ఞానాన్ని మనకు సుబోధకం చేస్తాడు!!*

- శ్రీబాబూజీ మహరాజ్

# భజ  గోవిన్దమ్

(గత సంచిక తరువాయి)

- రమణ ప్రసాద్

9. సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చల తత్త్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥

సజ్జన సాంగత్యంతో నిస్సంగత్వం కలుగుతుంది, దానివల్ల నిర్మోహత్వం ఏర్పడుతుంది. నిర్మోహత్వం కలిగిన అనంతరం నిశ్చలతత్త్వం అబ్బి, నిశ్చలబుద్ధి వల్ల జీమన్ముక్తి లభిస్తుంది. జీవన్ముక్తి అంటే పుట్టటం - గిట్టటం అనే వలలోనుంచి బయట పడటం. దానికి కావలసింది నిశ్చలతత్త్వం. నిశ్చలమైన బుద్ధి ఉండాలంటే మోహ వికారాలకు లొంగని మనస్సు ఉండాలి. అప్పుడు బంధాలకు అతీతంగా ఉండే అమనస్కస్థితి లభిస్తుంది. అది సజ్జన సాంగత్యం వల్ల లభిస్తుంది.



“సాంగత్యం వల్ల విషయాదులందు ఆసక్తి కలిగి అతనికి కోరిక కలుగుతోంది. ఆ కోరిక తీరకపోతే క్రోధం జనిస్తోంది. క్రోధం వలన మోహం, మోహం వలన మరపు, మరపు వలన బుద్ధి నాశము కలిగి అది అతని పతనానికి దారి తీస్తుంది” అని భగవద్గీత చెబుతోంది. కాని ఆ సాంగత్యం సజ్జనులతో కలిగితే అది జీవన్ముక్తికి దారి తీస్తుంది.. సజ్జనులంటే ఎవరు? భగవంతుని కరుణకు పాత్రులైనవారు.

ఇంతవరకు చెప్పుకున్నది - ఈ ప్రపంచంలో జీవించటం, సంపాదించటం, సంపాదించిన దానిని దాచటం - ఇదంతా భగవంతుని చేరటానికి తోడ్పడదు. సంసారం పైన రాగంతో ఉండటం పతనానికి దారి తీస్తుంది. ప్రేమ మోహాలలో పడిన అతని జీవితం వ్యర్థం అవుతోంది. వాటినుండి మనస్సును మరల్చి, భగవంతునిపై నిలపాలి.

శంకరులు నేరుగా సాధకులకు భగవంతుని వద్దకు చేరే నిచ్చెన

అందించారు. దానిని ఎక్కి సాధకుడు ఉన్నత స్థితిని పొందవచ్చు.

మన జీవితాలు ప్రపంచపు ఆకర్షణలకు లొంగిపోతున్నాయి. వివేకం ద్వారా ఈ పరిస్థితిని దాటాలి. కాని ప్రపంచంలోని తళుకు బెళు కులనుంచి బయట పడటం చాలా కష్టం. అది సజ్జన సాంగత్యం వల్ల సాధ్యం. సజ్జనులతో ఉండటం వలన మనస్సులో మంచి ఆలోచనలు కలిగి నిస్సంగత్వం లభిస్తుంది. దానివల్ల మోహ వికారాలు తొలిగి నిశ్చలతత్త్వం కలుగుతుంది. అది జీవన్ముక్తికి దారి తీస్తుంది. భగవద్గీతలో క్రిందికి జారే నిచ్చెన చూపించారు. శంకరులు పైకి ఎక్కే నిచ్చెన చూపించారు. ఆ నిచ్చెన ఎక్కి సాధకుడు అహంకార మమకారాలు తొలగించుకుని నిశ్చయబుద్ధి పొంది జీవన్ముక్తి పొందుతున్నాడు.

సశేషం

**సమర్థ సద్గురు మాసపత్రిక పాత ప్రతులను ఆన్‌లైన్‌లో చదవడానికి మీ స్మార్ట్‌ఫోన్‌తో ఈ ప్రక్కన ఇవ్వబడిన QR CODE స్కాన్ చేయండి.**

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**మే 2020**

7 గురు - శ్రీ గురు (వైశాఖ) పూర్ణిమ సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

17 ఆది - శ్రీగురు దశమి ఉ॥11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ఠ పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

21 ఆది - అమావాస్య సూర్యగ్రహణం ఉదయం 11-25ని॥ నుండి మధ్యాహ్నం 1-54ని॥ వరకు (మృగశిరా నక్షత్రం, మిధునరాశి)

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**మే 2020**

7 గురు - శ్రీగురు (వైశాఖ)పౌర్ణమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

12 మంగళ - వైశాఖ బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారల ప్రతిష్ఠా వార్షికోత్సవము. రాత్రి 7గం. సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

17 ఆది - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

21 గురు - మాసశివరాత్రి

22 శుక్ర - అమావాస్య

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ఠ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

15 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - మాసశివరాత్రి

21 ఆది - అమావాస్య. సూర్యగ్రహణం. ఉదయం 10-25 ని॥ నుండి మధ్యాహ్నం 1-54ని॥లు వరకు. (మృగశిర నక్షత్రం, మిధున రాశి)

# శత్రులు మిత్రులౌట

- పాలూరి కాళీ ప్రసాద్

**కమలములు నీట బాసిన**
**కమలాప్తుని రశ్మి సోకి కమలిన భంగిన్**
**తమ తమ నెలవులు తప్పిన**
**తమ మిత్రులు శత్రులౌట తథ్యము సుమతీ!**

కమలములు నీళ్ళల్లో వున్నంత కాలమూ సూర్యుడు వాటికి మిత్రుడే. ఆయన ప్రకాశం సోకిన కొద్దీ అవి మరింతగా విప్పారుతాయి. కానీ, అవే పద్మాలు నీటి నుండి బయటకు రాగానే ఆ సూర్యుని వేడికే కమిలిపోతాయి. అలాగే ఎవరు వుండవలసిన స్థానంలో వారు వున్నప్పుడే మిత్రత్వం వర్థిల్లుతుంది. కానీ, ఆ నెలవులు తప్పితే మిత్రులే శత్రువులుగా మారిపోతారని బద్దెనవారు వివరిస్తున్నారు. అలాగే మొసలి బలం గురించి చెబుతూ వేమన కూడా 'స్థాన బలిమి కాని, తన బలిమి కాదయా' అంటాడు. వారి వారి స్థానాలు మారేసరికి మిత్రత్వాలు, బంధుత్వాలు కూడా ఎలా మారిపోతున్నాయో ఈ రోజుల్లో చూస్తూనే వున్నాం.

మరి మనకు కూడా ఆరుగురు శత్రువులు వున్నారు కదా! వాళ్ళే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. వీటినే అంతశ్శత్రువులు అంటారు. బయట వాళ్ళెవరో మనకు శత్రువులుగా వుండి, మనలను నాశనం చేయాలని చూస్తున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ మనలోనే వున్న ఈ గుణాలు మనలను నాశనం చేయాలని చూడటం కొంచెం విచిత్రమే. ఇది తాను కూర్చున్న కొమ్మను తానే నరుక్కోవటం లాగా అనిపిస్తుంది. అయితే వీటికి మనతో శత్రుత్వం ఎలా వచ్చింది? అది పోయి మిత్రత్వం కలగాలంటే ఏం చేయాలో చూద్దాం.

పైన చెప్పుకున్నట్లుగా మన స్థానాన్ని మనం విడచిపెట్టడమే మిత్రులుగా వుండవలసిన వాళ్ళు శత్రువులుగా మారడానికి కారణం. మన అసలు స్థానం ఏది? భగవంతుడే మనందరికీ నెలవు. ఆయనను విడిచిపెట్టడం వల్లనే మన స్థాన బలం తగ్గి, మనలోనే వున్న గుణాలు మనకు శత్రువులుగా మారడం, మనం వాటిని మన బలంతో జయించలేక పోవడం జరుగుతోంది. ఈ శత్రువులు మనకు మళ్ళీ

మిత్రులుగా మారాలంటే మన స్థానానికి మనం చేరుకోవాలి. లేదా కనీసం ఆ దిశగా ప్రయాణమన్నా ప్రారంభించాలి. అప్పుడు మెల్ల మెల్లగా ఆయా గుణాలు తమ శత్రుత్వాన్ని వదలి మనకు మిత్రులుగా మారిపోతాయి. కామక్రోధాది అరిషడ్వర్గం శమాది షట్క సంపత్తిగా మారిపోతుంది. అదెలాగో చూద్దాం.

***కామం*** - మనకు దేనిమీదైనా కోరిక కలిగిందంటే ఇక అది తీరేవరకూ మనం ఏ పని చేస్తున్నా ఆ వస్తువే మన ఆలోచనలలో మెదలుతూ వుంటుంది. అది ఒక వస్తువైనా, సుఖమైనా, లేదా వ్యక్తి అయినా, మనకు ఆ కోరుకున్నది లభించేవరకూ మనఃశాంతి వుండదు. నిరంతరం దాన్ని గురించే ఆలోచిస్తూ వుంటాము. అదే మనం ఈ కామాన్ని భగవంతునివైపు మరల్చుకున్నాం అనుకోండి, అప్పుడు నిరంతరం ఆయన ధ్యాసే వుంటుంది. శరీరం ఏ పని చేస్తున్నా మనస్సు మాత్రం నిరంతరంగా ఆ పరమాత్మతోనే రమిస్తూ వుంటుంది. అదే ***ఉపరతి.***

***క్రోధం*** - మనం కోరుకున్నది మనకు దక్కకపోయినా, లేదా మనం అనుకున్నట్లుగా జరగకపోయినా, లేదా ఎదుటివారు అలా ప్రవర్తించకపోయినా మనకు క్రోధం వస్తుంది. అయితే మనస్సుని భగవంతునివైపు మరల్చినప్పుడు ఈ క్రోధం ఎదుటివారిపైన కాకుండా, మన ఆధ్యాత్మిక సాధనకు అడ్డువచ్చే మన ఇంద్రియాలు, మన గుణాలపైకి మరలుతుంది. అప్పుడే ఇంద్రియ నిగ్రహం సాధించగలుగుతాం. ఆ బాహ్యేంద్రియ నిగ్రహమే ***దమము.***

-సశేషం

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూాలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించుకొనవలసినదిగా విజ్ఞప్తి.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

మనకున్న సమయంలో మన జీవితానికి కావలసిన నిత్య నైమిత్తిక కర్మలకి ఎంత సమయం వెచ్చిస్తున్నాం? భగవంతుని కైంకర్యానికి ఎంత సమయం కేటాయిస్తున్నాం? అని లెక్కించుకోవాలి. గృహస్థు అయినా, బ్రహ్మచారి అయినా తన గృహానికి, శరీరపోషణకి అవసరమైన కర్మలు చేయాలి. పరిసరాలు శుభ్రంగా వుండాలని శ్రీగురుదేవులు అంటూవుండేవారు. ఎక్కడైనా ఒక చోట శుభ్రం చేయకుండా వదిలిపెడితే, 'ఈ బాహ్య పరిసరాన్నే శుభ్రం చేయలేకపోతే, ఇహ మనసుకి పట్టిన మాలిన్యాన్ని ఎలా కడుగుకోగలరు?' అనేవారు. మనసులో వున్న మాలిన్యం తొలగించుకోవాలంటే ఏం చేయాలని విచారణ చేయాలి? ఎప్పటికప్పుడు ఏ పని చేసినా వివేకదృష్టి కలిగి వుండాలి.

సాధన చతుష్టయ సంపత్తి విచారణతో ఏ పని చేస్తున్నా మనస్సులో పరమాత్మ భావన నిలుపుకుంటూ, భగవన్నామ స్మరణతో ప్రహ్లాద కుమారుడిలాగా చేస్తూ, వివేక దృష్టి తద్వారా అవసరం లేని పనులు త్యజిస్తూ, వైరాగ్య దృష్టి కలిగి వుంటే జీవితంలో సాధనలో ముందుకి వెడతారు. ఇది కాదు, అది కావాలనే కోరిక వుండదు. దొరికినది ఎంతైనా, ఏదైనా ప్రసాద దృష్టితో స్వీకరిస్తాం.

జీవుడు సుఖదుఃఖాలనే దోషాలు, మానసిక విక్షేపాలు, బుద్ధిలో అశాంతి అనుభవిస్తాడు. ఆ పరమాత్మే జీవుడి రూపం, దేహ, మనో, బుద్ధుల ద్వారా అభివ్యక్తమవుతాడు. జీవుడికి దోషాలు ఎందుకు కలిగాయి అంటే తన నిజ స్థితిని గుర్తించకపోవడం వలన. తాను దేహధారినే అని అనుకోవడం వలన. ఇవి తొలగాలంటే మహాత్ములు ప్రణవోపాసన తెలిపారు.

ఓంకారోపాసనే ప్రణవోపాసన. ఓంకార శబ్దం హృదయం, గొంతు నుంచి కాకుండా నాభినుండి రావాలి. ముందుగా ఈ ఉ

పాసన కోసం మనకు మనం కొంత సమయాన్ని కేటాయించాలి. తొందర తొందరగా వచ్చి కూర్చుని ఏదో చేయాలి కదా అని చేయకూడదు. వచ్చి కూర్చున్న వెంటనే మనసు ధ్యానంలోకి నిలబడి పోవాలంటే నిలవదు. ఆ నిలకడ కోసమే గురువులు ప్రసాదించిన మంత్రం ఉచ్చారణకి పూర్వం ఓంకారం ఉచ్చరించాలి. ధ్యానానికి కూర్చునేటప్పుడు ముందుగా గురువుకి, భగవంతుడికీ నమస్కరించాలి. తరువాత కదలకుండా వుండే ఆసనం, ఒక మంగళప్రదమైన, స్థిరమైన ఆసనం (స్థిరమాసన మాత్మనః అని భగవద్గీతలో చెప్పినట్లుగా) తన కోసం ఏర్పరుచుకోవాలి.

-సశేషం



# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

**"ఎవ్వాని రక్షింప నిశ్చయించితి వాని! యఖిల విత్తంబు నేనపహరింతు"** - ఇది సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే భాగవతంలో వామనావతార ఘట్టంలో ప్రకటించిన రహస్యము. భగవంతుడు ఎవరినైనా రక్షించటానికి నిశ్చయించుకున్నపుడు, అతనికి సిరిసంపదలను మరింతగా ప్రసాదించాలిగాని, ఉన్న దాన్ని కూడా మొత్తం అపహరించటమేమిటి?

కొంచెం లోతుగా విచారిస్తే, అలా అపహరించటంలోని ఆంతర్యమేమిటో అర్థమవుతుంది. సిరి సంపదలు పెరిగిన కొద్దీ మానవుడు భోగలాలసుడై, గర్వోన్మత్తుడై ఆ సిరి సంపదలను ప్రసాదించిన భగవంతునే మరిచిపోతాడు. అవి శాశ్వతమైనవి కావు. కనుక నశించక తప్పదు. అందువలన దు:ఖం తప్పదు. పూర్తిగా నిస్సహాయుడైనపుడు గాని (విషాద యోగం వలన గాని) అతని మనసు భగవంతుని అనన్య చింతనను నిలుపుకొన్నవాని యోగ క్షేమమును తానే చూసుకుంటానని ఆ పరమాత్ముడే అభయమిచ్చాడు.



**అనన్యాశ్చిన్తయంతో మాం। యే జనా: పర్యుపాసతే।**
**తేషాం నిత్యాభియుక్తానాం। యోగక్షేమం వహామ్యహం॥**

(భగవద్గీత)

కనుక కృపా సముద్రుడైన భగవానుడు ఎవరిని తాను కృతార్థుని చేయాలని నిశ్చయించుకుంటాడో, అతని చంచలమైన 'శ్రీ'ని (ప్రాపంచిక సిరి సంపదలను) అపహరించి, తన యందు అనన్యచింతనను కలిగించి, అచంచలమై శాశ్వతమై, దు:ఖరహితమై అఖండానంద సంధాయకమైన ఆత్మజ్ఞానమనే సంపదను (శ్రీని) అతనికి అందజేసి తన వానినిగా చేసుకుంటాడు.

శ్రీ దామోజీరావు శ్రీహరిరావుగారు గుండుగొలను గ్రామ వాస్తవ్యులైన బ్రాహ్మణులు. డబ్భై ఎకరాల సుక్షేత్రమైన పొలం గల

భూస్వామి. రెండు గ్రామాల మొఖాసాదారు. ఏలూరు పట్టణంలో ఆంధ్రప్రభ దినపత్రిక ప్రత్యేక విలేఖరిగా 'పెద్దల' పరిచయం గలవారు. అనేక సహాయ సంస్థలకు విరివిగా విరాళాలిచ్చిన దాతలు. అవన్నీ వారు సిరితో తులతూగిన రోజులు.

ఒక దశాబ్దం పాటు వెలిగిన యీ దశ, ఆ తరువాత మారిపోయింది. స్వంత వ్యవసాయం పేరుతో ఏలూరు విడిచి గుండుగొలను చేరిన కొద్ది కాలం లోనే ఆయన సిరి అంతా, ఆయన అలవాటుగా కాల్చే సిగరెట్ పొగ వలెనే 'హరీ' అన్నది. అప్పుడు గాని శ్రీహరిగారికి 'హరి' గుర్తుకు రాలేదు. "ఆ హరి మనతోనే ఉన్నా'డని ఆయన బాల్య మిత్రులైన శేషగిరి రావు గారు ధైర్యం చెప్పి, శ్రీహరి గారిని శ్రీబాబు వద్దకు తీసుకొని వెళ్ళారు. అంతకు మునుపు అప్పుడప్పుడు శేషగిరిరావు గారి ద్వారా శ్రీ బాబును గురించి వింటున్నా, అప్పుడు గాని శ్రీహరిగారికి 'గురి' కుదరలేదు. ఆ అదునుకోసమే ఎదురు చూస్తున్న శరణాగత వత్సలుడైన శ్రీ బాబు "శ్రీహరి ఎప్పుడూ నా వాడే" అని శ్రీహరిగారిని అక్కున జేర్చుకుని "వీడెప్పుడూ నీ వాడే" అన్నారు.

అప్పటి నుంచి అనుక్షణం శ్రీ బాబు స్మరణలోనే శ్రీహరిగారు శేష జీవితమంతా గడిపారు. ఒకసారి శ్రీహరిగారు , బందాతాతయ్యగారు (శ్రీ బాబు వాళ్ళను 'వృద్ధ పండితులు' అనేవారు) గుండుగొలను నుండి శ్రీ బాబు దర్శనార్థం పోతునూరు బయల్దేరారు. శ్రీ బాబును గురించి మాట్లాడుకుంటూ ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరినవారు, రెండు మైళ్ళ దూరంలో ఉన్న పోతునూరు చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. రెండు మైళ్ళూ ఐదు గంటలు నడిచామా? అని ఆశ్చర్యపోయారు వాళ్ళు. అంతలో శ్రీబాబు వాళ్ళకు దర్శన మిచ్చి కుశల ప్రశ్నలు వేశారు. సాయంకాల పూజానంతరం శ్రీ బాబు శ్రీకృష్ణ లీలా విశేషాలను ఉగ్గడిస్తూ బోధించారు. వృద్ధ పండితులు శ్రీ బాబును శెలవు కోరారు. శ్రీ బాబు టైము చూసి "అబ్బో! పన్నెండు గంటలైందే! అయిదింటికల్లా చేరిపోతారా?" అన్నారు. "ఎందుకు బాబూ! చక చకా అడుగులు వేస్తే అరగంటలో చేరిపోతాము" అన్నారు."అట్లాగా! అయితే వెళ్ళండి" అన్నారు శ్రీ బాబు.

-సశేషం

## యుధిష్ఠిరుడు - యక్షుడు

- గాలి జగదీశ్

పాండవులు అరణ్యవాసం గడిపే కాలంలో ఒక రోజు అడవిలో వెడుతూ వుండగా వారికి దాహం వేసి, ఒక స్థలంలో ఆగిపోయారు. యుధిష్ఠిరుడు చిన్న తమ్ముడిని నీరు ఎక్కడుందో తెలుసుకోమన్నాడు. నీటికై వెదకుతూ సహదేవుడు శుభ్రం మరియు శుద్ధంగా వున్న మంచినీటి సరస్సు కనుక్కొన్నాడు. తను నీరు త్రాగి, అన్నలకు నీరు తీసుకుని వెడదామనుకున్నాడు.

సహదేవుడు చేతులు సరస్సులో ముంచి నీటిని పైకి తీసేలోపు ఈ విధంగా మాటలు వినిపించాయి. 'నీవు ఈ నీళ్ళు త్రాగే ముందు నా యీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి' అని. సహదేవుడు చుట్టూ చూశాడు ఎవరైనా వున్నారా అని. కానీ ఎవరూ కనబడకపోవడంతో మళ్ళీ నీరు త్రాగే ప్రయత్నం చేశాడు. అదే విధమైన సూచన మళ్ళీ వచ్చింది. కానీ, ఈసారి ఆ సూచన లెక్కచేయకుండా నీరు త్రాగడానికి ప్రయత్నించే సరికి స్పృహ తప్పి క్రింద పడిపోయాడు. సహదేవుని వెతుకుతూ వరుసగా ఒకరి తరువాత మరొకరు చొప్పున పాండవులంతా వచ్చి యక్షుడికి సమాధానం చెప్పలేక ఇదే పరిస్థితిలో ఇరుక్కున్నారు. ఆఖరికి ఎప్పుడైతే ధర్మరాజు యక్షుడి ప్రశ్నలకు సరియైన సమాధానం చెప్పాడో యక్షుడు సంతృప్తి చెంది ప్రత్యక్షమయ్యాడు. యుధిష్ఠిరుడు అతనికి నమస్కరించి, తన తమ్ముళ్ళను సజీవంగా చేయమని కోరాడు. దానికి యక్షుడు 'మీ తమ్ముళ్ళల్లో ఎవరో ఒకరిని మాత్రమే బ్రతికించగలను. మరి నీకు ఎవరు కావాలో కోరుకో' అన్నాడు. 'నాకు సహదేవుడు కావాలి' అన్నాడు యుధిష్ఠిరుడు. అప్పుడు యక్షుడు 'అలా ఎందుకు కోరావు? భీముడో, అర్జునుడో అయితే నీకు సహాయ పడేవారు కదా?' అని అడిగాడు.

దానికి సమాధానం చెబుతూ ధర్మరాజు 'మేము అయిదుగురము ఇద్దరు తల్లుల ద్వారా కలిగాము. అందులో కుంతీదేవి సంతానంలో నేను బ్రతికి వున్నాను. అందుచేత ఇంకొకతల్లి మాద్రిదేవి సంతానంలో ఒక కొడుకును సజీవంగా కోరుతున్నాను' అన్నాడు. యక్షుడు ఎంత నచ్చచెప్పాలని చూసినా ధర్మరాజు చలించలేదు. 'ఎవరైతే ధర్మాన్ని రక్షిస్తారో అది వారిని రక్షిస్తుంది. నేనింత వరకూ ఎన్నడూ ధర్మాన్ని విడిచిపెట్టలేదు, పెట్టను కూడా' అన్నాడు. దానికి యక్షుడు ఎంతో సంతోషించి, యమధర్మరాజే యక్షుని రూపంలో వచ్చి పరీక్షించానని చెప్పి, అతని తమ్ముళ్ళందరినీ తిరిగి బ్రతికించాడు.




# శ్రీ శంకర భగవత్పాదులు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

అయితే ప్రత్యక్షంగా కనిపించే ప్రపంచాన్ని అసత్యం అని ఎలా నమ్మటం? పరతత్త్వం ఒకటి ఉన్నదని ఎలా తెలుసుకోవటం? ఆస్థి, చర్మ, రక్త మాంసాలతో కూడిన జీవి పరబ్రహ్మ స్వరూపుడని ఎలా తెలుసుకోవటం? కనిపించేది నిజం అనుకోవటం సహజం కనక కనిపించని నిజాన్ని తెలుసుకోవటం జ్ఞాని లక్షణం. దీనికి లోకోత్తరమైన అనుభూతి కావాలి. ఇట్టి అనుభూతిని శంకరులు సాధకలోకానికి ప్రసాదించారు. జగన్మిథ్యః- మిథ్య అంటే లేనిది. అసత్యం. అయితే శంకరుల సాంకేతికార్థం వేరు. మిథ్య అంటే నిజంగా లేని దానిని ఉన్నట్లుగా భ్రమ కల్పించేది. ఈ జగత్తు ఉంది. కాని లేదు కూడ. శంకరులు ఈ జగత్తును మాయ అన్నారు. ఈ మాయకు కారణం అజ్ఞానం, అవిద్య. జ్ఞానోదయం కాగానే సూర్యకాంతికి మంచు తెరలు తొలగినట్లు ఈ మాయ(అవిద్య) తొలగిపోతుంది.



ఈ భావానికి శంకరులు తరచుగా పేర్కొనే ఉదాహరణ: రజ్జు సర్ప భ్రాంతి- మసక చీకటిలో ఒక త్రాడు మెలికలు తిరిగి పడి ఉంది. దానిని చూసి పాము అనే భ్రమ కలుగుతుంది. భయంతో బిగుసుకుపోతాము. ఇంతలో వెలుతురు వస్తుంది. అది పాము కాదని త్రాడు మాత్రమే అని తెలుస్తుంది. భయం తొలగిపోతుంది.

జగత్తు కూడ అలాంటి సర్పభ్రాంతి అని శంకరుడు అంటారు. మనం అజ్ఞానం అనే మసక చీకటిలో ఉన్నంత కాలం జగత్తు ఉన్నట్లే కనిపిస్తుంది. ఇది మనస్సు కల్పిస్తున్న భ్రమ అని తెలియగానే జగత్తు మాయమైపోతుంది.

రజ్జు సర్పభ్రాంతిలో రజ్జువు మీద పాము అధ్యారోపితమైంది. అంతే కాని కాసేపు ఆ త్రాడు పాముగ మారటం జరగలేదు. త్రాడు త్రాడుగా ఉండగానే పాముగా కనపడటం మాత్రమే జరిగింది. దీనినే శంకరులు అధ్యారోపం లేక అధ్యాసం అన్నారు. ఈ జగత్తు విషయంలో కూడ అధ్యారోపం జరుగుతోంది. దేనిపైన? బ్రహ్మంపైన. ఉన్నది ఒక్కటే. అదే బ్రహ్మం. "సర్వం ఖల్విదం బ్రహ్మ" అన్నది శృతి. మానవుడు మాయలో పడి బ్రహ్మమీద జగత్తును ఆరోపిస్తున్నాడు. అంటే బ్రహ్మం బ్రహ్మంగానే ఉంది. బ్రహ్మ మార్పు చెందకుండానే, మన అజ్ఞానంవల్ల జగత్తుగా భాసిస్తోంది. ఈ సిద్ధాంతాన్నే వివర్తవాదం అంటారు.

మాయకు "ఆవరణ శక్తి", "విక్షేపశక్తి" అని రెండు శక్తులు ఉన్నాయి. ఉన్న యదార్థ రూపాన్ని మరుగుపరిచే శక్తి "ఆవరణశక్తి". లేని దానిని ఉన్నట్లు చూపే శక్తి "విక్షేపశక్తి". రజ్జు సర్ప ఉదాహరణలో మన అజ్ఞానం రజ్జు స్వరూపాన్ని మరుగు పరచి లేని పామును ఉన్నట్లు చూపుతుంది. మాయకే అజ్ఞానం,అవిద్య అని నామాంతరాలు ఉన్నాయి.

ఒక గారడి వాడు ఒక రూపాయి నాణేన్ని అనేక నాణాలుగా కనపడేటట్టు చేస్తాడు. అలా చేయటానికి కారణం – అతనిలోని మాయాశక్తి. చూచేవారు అన్ని నాణేలుగ చూడటం – వారి అజ్ఞానం. మాయ గారడివాడికి లొంగి ఉంటుంది. మనం మాయకు లొంగి ఉంటాము. అదే విధంగా ఈశ్వరుడికి మాయ లొంగి ఉంటే మనం మాయకు లొంగి ఉంటున్నాము. మాయ అనే నాణానికి "భ్రమ" ఒకవైపు అయితే రెండవ వైపు "స్వప్నావస్థ" – జగన్మిథ్యత్వాన్ని నిరూపించటానికి శంకరుడు ప్రధానంగా ఆధారపడింది స్వప్నావస్థ మీద –
**సంసారం స్వప్నతుల్యోహి రాగ ద్వేషాదిసంకులః ।**

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD